# దోపిడీదారులంతా ఒక్కటయ్యారు..



విప్ గువ్వలకు స్వాగతం పలికేందుకు డిండి నుంచి బైక్ ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు

- నన్ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారు..
- అచ్చంపేటలో మూడోసారి విజయం సాధిస్తాం..
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు
- అచ్చంపేటకు భారీగా తరలివచ్చి స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

అచ్చంపేట, అక్టోబర్ 16 : అచ్చంపేటను ఆగం చేసేందుకు దోపిడీదారులంతా ఒక్కటయ్యారని, నన్ను ఓడించేందుకు కుట్రలు పన్నుతూ గ్రామాలకు వస్తున్నారు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థిగా గువ్వల సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఫారం అందుకొని అచ్చంపేటకు వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. అచ్చంపేట నియోజకవర్గంలోని దేవరకొండ ఎక్స్ రోడ్డు నుంచి అచ్చంపేట కొత్త బస్టాండ్ వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన బైక్‌ర్యాలీ చారగొండ, వంగూరు, ఉప్పునుంతల మీదుగా సాగి అమ్రాబాద్, పదర, అచ్చంపేట, బల్మూర్, లింగాల మండలాల నుంచి సాయంత్రం 5గంటల వరకు అచ్చంపేటకు చేరుకుంది. అడుగడుగున కార్యకర్తలు గువ్వల దంపతులను పూలమాలతో సత్కరించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీర్వదించి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి బీఫారం అందించి పంపించారని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు అచ్చంపేటలో గులాబీజెండా ఎగురవేసి కానుకగా పంపించాలన్నారు. స్వార్థపరులు, పెత్తందారులు కొందరు పార్టీ నుంచి వెళ్లిపోయినంత మాత్రనా ఒరిగేదేమీలేదన్నారు. అచ్చంపేటలో బీఆర్ఎస్ పనైపోయిందని అనుకొనేవారు. ఈరోజు జరిగిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న వారి సంఖ్యను లెక్కించుకోండని సూచించారు. అచ్చంపేటలో ఆట ఇప్పుడే మొదలైందని ఈరోజు కదిలిన గులాబీ దండు శ్యాంపిలేనని ఈ నెల 26న సీఎం కేసీఆర్ సభ ద్వారా ప్రతిపక్షాల దిమ్మతిరుగుతుందన్నారు. ప్రశాంతంగా ఉన్న అచ్చంపేటను తమ చేతుల్లోకి తీసుకొని దోపిడీ, పెత్తనం చేలాయించేందుకు అందరు కుట్రలు పన్నీ నన్ను ఓడిస్తామని అంటున్నారట, పేదలు, దళితులు, గిరిజనులు, రైతులు ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి కుట్రదారులకు లేదన్నారు. అచ్చంపేటకు సాగునీరు తెస్తున్నందుకు ఓడిస్తారా, వందపడకల దవాఖాన కట్టించినందుకు, గ్రామాలకు సీసీ రోడ్లు, మసీదులు, చర్చీలు, ఆలయాలకు నిధులు ఇచ్చినందుకు ఓడిస్తారా? అంటూ ప్రశ్నించారు. పేదలతో తనకున్న బంధాన్ని ఎవరూ విడదీయలేరన్నారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా బీఆర్ఎస్ సైనికుల గెలుపును ఆపడం ఏవరివల్ల కాదన్నారు. స్వచ్ఛందంగా ఇంతపెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, అచ్చంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి ఇంతియాజ్ ఇసాక్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు పోకల మనోహర్, మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, జెడ్పీటీసీ రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పర్వతాలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**వలసవాదిని కాదు..!**

వంగూరు అక్టోబర్ 16 : వలసవాదిని కాదు గత 17 ఎండ్లుగా అచ్చంపేట ప్రజల సాదక, బాధకాల్లో పాలుపంచుకుంటూ నిరంతరం ఈప్రాంత అభివృద్ధి కోసం పాటు పడుతూ వారి గుండెల్లో గూడు కట్టుకున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ముచ్చటగా మూడోసారి అచ్చంపేట ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు వీలుగా సీఎం కేసీఆర్ నుంచి బీఫారం తీసుకొని సోమవారం మండలానికి వచ్చిన ప్రభుత్వ విప్ గువ్వల దంపతులకు వంగూరు, చారకొండ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వంగూరులోని గెల్వలాంబ మాత ఆలయంలో అమ్మవారి వద్ద బీఫారం ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిప్పారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వీహెచ్ఆర్ గార్డెన్స్‌లో రెండు మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అచ్చంపేట అసెంబ్లీ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఇంతియాజ్ ఇషాక్‌తో కలిసి విప్ గువ్వల మాట్లాడుతూ కొంత మంది పార్టీలో పదవులు అనుభవించి స్వార్థంతో ఇతర పార్టీలోకి వెళ్లారని దుయ్యబట్టారు. స్వార్థపరులు ఇతర పార్టీలకు వెళ్తుంటే, నిజాయితీపరులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ఎన్ని కుట్ర లు చేసినా అచ్చంపేటలో 50వేల మెజార్టీతో బీఆర్ఎస్ గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వంగూరు, చారకొండ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రవీందర్, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గణేశ్‌రావు, నరేందర్‌రావు, హమీద్, యాదయ్యగౌడ్, లాలుయాదవ్, విజేందర్‌గౌడ్, యాతం శ్రీను, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో దసరా సంబురాలు

- బ్రహ్మచారిణీగా భ్రామరి దర్శనం
- అలంపూర్‌లో కనులపండువగా వేడుకలు



బ్రహ్మచారిణీగా జోగులాంబ అమ్మవారు

శ్రీశైలం అక్టోబర్ 16 : శ్రీశైలంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు ఉత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్టాపారాయణాలు, చండీహోమం, పంచాక్షరీ, భ్రామరీ, చతుర్వేద పారాయణాలు కుమారి పూజలు జరిపించారు. సోమవారం భ్రామరీ అమ్మవారిని సింహమండపం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై బ్రహ్మచారిణీ రూపంలో అలంకరించి విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం అక్క మహాదేవి అలంకార మండపంలో శ్రీభ్రామరాంబ మల్లికార్జునులు మయూరవాహనాన్ని అధిష్టించి భక్తులను కరుణించారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరింపజేసి విశేష పూజ లు, అర్చనలు నిర్వహించిన తరువాత గ్రామోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులు మయూర వాహనంపై గంగాధర మండపం నుంచి మొదలుకొని నంది మండపం మీదుగా బయలుదేరి వీరభద్రస్వామి వరకు విహరిస్తూ భక్తాదులను కరుణించారు. గ్రామోత్సవంలో నాదస్వరం, మహిళా వీరగాని కన్నడ జానపద కళా ప్రదర్శన, రాజభటుల వేషాలు, కేరళ వారి కథాకళి వేషాలు, తప్పెట చిందు, లంబాడి నృత్యం, కాళికా నృత్యం, చెక్కభజన, కోలాటం, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లగ్రోవి, త్రిశూలం, జేగంట, కురమడోలు, కొమ్ము, నందికోళ్ల సేవ మొదలగు వివిధ రకాల విన్యాసాలతో ఆద్యంతం కనులపండువగా సాగింది. ఉత్సవం తరువాత సువాసిని పూజ, కాళరాత్రిపూజ మంత్రపుష్పంతో పాటు తీర్థప్రసాద వితరణ, ఆదిదంపతులకు ఆస్థాన సేవ జరిపించారు. కార్యక్రమంలో ఈవో పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు ఉన్నారు.

**బ్రహ్మచారిణీదేవీగా జోగులాంబ..**

అలంపూర్, అక్టోబర్ 16 : అలంపూరు క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సోమవారం గణపతి పూజ, చండీహోమాలు, వారోత్సవ పూజలు, దర్బార్ సేవ, నీరాజ మంత్ర పుష్పములు తదితర పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు జోగులాంబాదేవి బ్రహ్మచారిణీ మాతగా భక్తులకు దర్శమినచ్చింది. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో పుస్తకం, జపమాల, దండం, ధరించి సాధువుగా ఉంటూ దర్శనమిచ్చే ఈ మాతను ఆరాధించడం వల్ల అరిషట్ వర్గాలను జయించవచ్చని అర్చకులు వివరించారు. పూజల్లో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు ఉన్నారు.

# ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

- ప్రిసైడింగ్ అధికారుల శిక్షణలో జిల్లా ఎన్నికల అధికారిఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 15: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదే.. అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లాలో జరగనున్న 2023 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి మండలాల ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా ఎన్నికల అధికారి హాజరై మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికల్లో కొన్ని మార్పులను చేసిందన్నారు. ముఖ్యంగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగాన్ని సంబంధిత ట్రైనింగ్ కేంద్రాల్లోనే వినియోగించుకొనే ఏర్పాటు చేసిందన్నారు. అదేవిధంగా గత ఎన్నికల్లో ఎం-2 రకానికి చెందిన ఈవీఎం యంత్రాలను ఉపయోగించగా ఈసారి కొన్ని రకాల అక్రిడిటేషన్లతో ఎం-3 ఈవీఎం యంత్రాలను వినియోగిస్తుందన్నారు. ప్రిసైడింగ్ అధికారులు ఈవీఎం యంత్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసారి పోలింగ్ శాతాన్ని వెల్లడించేందుకు పీవోలకు యాప్‌ను ఇవ్వనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారులు మాత్రమే ఫోన్ వినియోగించుకొనే సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని ఫోన్ సైలెంట్ ఆప్షన్‌లో ఉంచుకోవాలన్నారు. ఇతరులకు ఎవరికీ ఫోన్ అనుమతి ఉండదన్నారు. అనంతరం వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణలో శిక్షణ నోడల్ అధికారి డీఆర్డీఏ నర్సింగ్‌రావు, డీపీవో కృష్ణ, డీఈవో గోవిందరాజులు, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్స్ రాజశేఖర్‌రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




యాదాద్రిలో నర్సింహస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి దంపతులు

## యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మర్రి దంపతులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, జమునారాణి దంపతులు సోమవారం యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి మూడోసారి భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి బీఫారంను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా లక్ష్మీనర్సింహస్వామిదిని దర్శించుకొని మొక్కు తీర్చుకొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ ప్రాంత ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు మర్రి వేడుకున్నట్లు వెల్లడించారు. మూడోసారి గెలుపునకు ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు.



ఎరుకల సంఘం సమ్మేళనంలో మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## కులవృత్తుల బలోపేతానికి కృషి

- ఎరుకలి సంఘం సమ్మేళనంలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, అక్టోబర్ 16 : కులవృత్తుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్ ఆవరణలో ఎరుకలి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని, ప్రతిపక్ష పార్టీలు చేప్పే మోసపూరిత హామీలను నమ్మవద్దని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం మనందరిపై ఉందని, అదేవిధంగా కల్వకుర్తి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్‌ను మరోసారి గెలిపించుకునే విధంగా ఐక్యంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కిశోర్‌రెడ్డి, ఎరుకలి సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రాగూర్‌తండా యువకులు

## బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

ఊర్కొండ, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులైన యువకులు బీఆర్ఎస్‌లో చేరినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ఊర్కొండపేట పరిధిలోని రాగూర్‌తండాలో మొదటిసారి ఓటు హక్కు పొందిన యువకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజేందర్‌నాయక్, సీనియర్ నాయకుడు నాగోజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తరుణ్, సాయికుమార్, శ్రీను, ఆనంద్, తరుణ్, ప్రవీణ్, అన్వేశ్, చరణ్ తదితరులు ఉన్నారు.